క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



మహాముత్తారం: మండలంలోని ములుగపల్లి గ్రామానికి చెందిన దడిగెల సది కొన్ని రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో సదికి వైద్య ఖర్చుల నిమిత్తం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.లక్ష 25వేల ఎల్‌ఓసీని మంజూరు చేశారు. కాగా ఆస్పత్రి సహాయకుడు సచిన్ గురువారం బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీని హైదరాబాద్‌లో అందజేశారు.

అనుమతి పత్రాలు కలిగి ఉండాలి



చిట్యాల: ప్రతి వాహనదారుడు తప్పకుండా అనుమతి పత్రాలు కలిగి ఉండాలని ఏఎస్సై మధుసూదన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వాహనాదారుడు హెల్మెట్ తప్పకుండా ధరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది యాకన్న, రవి, వీరారెడ్డి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే నిర్వహించాలి

కన్నాయిగూడెం: మండలంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిబంధనల ప్రకారమే నిర్వహించాలని ఎంపీపీ జనగం సమ్మక్క అన్నారు. మండలంలోని గుర్రేవుల వద్ద నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ జనగం సమ్మక్క కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ఎలాంటి అవకతవకలు జరిగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జెడ్పీటీసీ కరన్ చందుగాంధీ, కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు, టౌన్ అధ్యక్షుడు మంగళారపు సత్యం, నాయకులు ఆలం చిరంజీవి, బొగ్గుల సుధాకర్, సునార్కని పెద్ద మల్లయ్య, సత్యనారాయణ, శ్రీధర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



మహదేవపూర్: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో షాదీముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ ఉన్నారు.

'గంజాయి గుట్టు చెప్పండి.. బహుమతి పొందండి'

కాళేశ్వరం: గంజాయి గుట్టు చెప్పి బహుమతి పొందాలని కాళేశ్వరం ఎస్సై జె.లక్ష్మణ్‌రావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. యువత గంజాయి, ఇతర దురలవాట్లకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఎవరైనా గంజాయి రవాణా గుట్టు తమకు తెలిపితే వారి సమాచారం, వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచి బహుమతి అందజేస్తామన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



చిట్యాల: మండలంలోని చింతకుంటరామయ్యపల్లి గ్రామానికి చెందిన బొంపెల్లి లక్ష్మన్‌రావుకు చెందిన పాడిగేదె విద్యుదాఘాతంతో గురువారం మృతి చెందింది. బాధితుడి వివరాల ప్రకారం.. రోజువారి లాగే పాడి గేదెను మేతకోసం తీసుకుపోతుండగా రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్‌కు తగిలి అక్కడిక్కడే మృతి చెందిందని తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే పాడిగేదే మృత్యువాత పడిందన్నారు. గేదె విలువ రూ.50వేలు ఉంటుందని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

రహదారికి మరమ్మతు

వాజేడు: తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ 163 నంబర్ జాతీయ రహదారికి మరమ్మతులను చేపట్టారు. జాతీయ రహదారి పలు చోట్ల తారు లేచి పోయి ప్రమదకరంగా మారింది. దీంతో మండల పరిధిలోని దూలాపురం నుంచి జాతీయ రహదారి మరమ్మతు పనులను చేపట్టారు. తారు లేచి పోయిన చోట తారు వేస్తున్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి



మల్హర్: దీక్షిత్‌ను సన్మానిస్తున్న అడిషన్ కలెక్టర్ వెంకటేశ్వర్లు



టేకుమట్ల: ప్రభుత్వ పథకాలపై అవగహన కల్పిస్తున్న దీక్షిత్

మల్హర్: కేంద్రం ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ప్రభారీ అధికారి దీక్షిత్ అన్నారు. మండలంలోని కొయ్యూరు కమ్యూనిటీ హాల్ ఆవరణలో కొయ్యూరు తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షిత్ మాట్లాడాతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తోన్న సుకన్య సమృద్ధి యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, పీఎం ఆవాస్ యోజన, పీఎం జన్‌ధన్, అటల్ పింఛన్ యోజన తదితర పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిదన్నారు. అర్హత ఉన్న వారు పథకాలు లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదనే గొప్ప లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారాని స్పష్టం చేశారు. ఈ పథకాలపై అవగాహన కల్పించడానికే గ్రామల్లో ప్రాజెక్టర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వం చేపట్టిన, చేపట్టే పథకాలు, సౌకర్యాలు వివరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే డ్రోన్‌లతో పంట పొలాలకు పురుగుల మందుల పిచికారీ, డ్రోన్లకు బ్యాంకు ద్వారా రుణ సదుపాయలు కల్పిస్తున్నట్లు వివరించారు. పోస్టల్ శాఖ, వైద్య సదుపాయాలు, విద్యపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. అనంతరం దీక్షిత్‌ను అడిషన్ కలెక్టర్ వెంకటేశ్వర్లు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ నరసింహమూర్తి, సర్పంచ్ సిద్ధి లింగమూర్తి, ఉపసర్పంచ్ మమత, తెలంగాణ, కేడీసీ బ్యాంకు మేనేజర్లు, భారత్ ఆరోగ్య మిత్ర టీం లీడర్ అనిల్, కార్యదర్శి ప్రసాద్, ఐకెపీ సిబ్బంది, వైద్య, పోస్టల్ సిబ్బంది మహిళ సంఘాల గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

టేకుమట్ల: గ్రామీణ ప్రాంత ప్రజలు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వికాసిత్ భారత్ సంకల్ప యోజన డిస్ట్రిక్ట్ ఆఫీసర్ యోగేష్‌మోహన్‌దీక్షిత్ అన్నారు. గురువారం మండలంలోని అంకుషాపూర్‌లో వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వికాసిత్ భారత్ సంకల్ప యోజన డిస్ట్రిక్ట్ ఆఫీసర్ యోగేష్‌మోహన్‌దీక్షిత్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకున్న లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ అనిత, ఎంపీఓ సురేష్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ మంగేష్, వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, స్థానిక సర్పంచ్ పండుగ శ్రీను, చిట్యాల సీహెచ్‌సీ ఆరోగ్య మిత్ర గుర్రపు రాజమౌళి పాల్గొన్నారు.

పిల్లలతో పనులు చేయిస్తే కేసులు



షాపులో ఆరా తీస్తున్న ఎస్సై షా–ఖాన్

టేకుమట్ల: పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని ఎస్సై షా–ఖాన్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల వ్యాపార సముదాయాల్లో జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ బృందంతో కలిసి ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిరాణం, హోటళ్లు, ఇటుక బట్టీలు, భవన నిర్మాణ పనుల్లో 14 సంవత్సరాలలోపు పిల్లలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలు వయస్సుకు మించి పనులు చేస్తే భవిష్యత్‌లో అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతారన్నారు. శారీరకంగా, మానసికంగా ఒత్తిడికి లోనై ఇబ్బందులు పడుతారని పిల్లల తల్లిదండ్రులు గమణించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా చిన్న పిల్లలతో పనులు చేపిస్తే రూ.50వేల జరిమానాతో పాటు, జైలుశిక్ష పడుతుందని అన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098కి సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట చైల్డ్ హెల్ప్‌లైన్ బృందం చంద్రకళ, శ్రీనివాస్, రాజు, శ్రీను, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఎస్‌టీయూ జిల్లా కమిటీ క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

టేకుమట్ల: తెలంగాణ టీచర్స్ యూనియన్ (ఎస్‌టీయూ) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని గురువారం జిలా కేంద్రంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లావుడ్య రమేష్, రేపాల గణేష్, గుగ్గిల్ల విజేందర్, మంద సీలిమారెడ్డి, పొనగంటి సదయ్య, రంగారావు, జిల్లా సీనియర్ నాయకులు కుర్రె ప్రవీన్, తదితరులు ఉన్నారు.

మహాముత్తారం: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం మండల కేంద్రంలో ఎంపీడీఓ అంజనేయులు, తహసీల్దార్ శ్రీనివాస్ , మండలనోడల్ అధికారి ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రవినాయక్, ప్రధాన కార్యదర్శి రాంసింగ్‌నాయక్, రాష్ట్ర అసోసియేట్ జయమధూకర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి మల్లేష్, మండల అసోసియేట్ అధ్యక్షుడు రవీందర్, దేవుసింగ్ ఉన్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలేవి?



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కాటారం: కాటారం పీఎచ్‌సీలో గత వైద్యుడు చేసిన నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ ఎంక్వైయిరి జరిగినప్పటికీ అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని జన ఆరోగ్య సమితి సమావేశంలో పలువురు సభ్యులు ప్రశ్నించారు. కాటారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. నిధుల రికవరి చేయకుండా అవినీతికి పాల్పడిన వైద్యుడుని విధుల్లోకి ఎలా తీసుకుంటారని సభ్యులు ప్రశ్నించారు. అలాగే ఆస్పత్రి ఆవరణలో పిచ్చి మొక్కలు ఏరివేత, ల్యాబ్ పరికరాల కొనుగోలు, బయోమెడికల్ పిట్స్ నిర్మాణం, రోగులు కూర్చోవడానికి కుర్చీల కొనుగోలు, స్టేషనరి ఐటమ్స్ కొనుగోలు కోసం తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, తహసీల్దార్ నాగరాజు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కొమురయ్య, ఎంపీటీసీ జాడి మహేశ్వరీ, ఎంపీడీఓ శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి దాతకు సన్మానం



లింగమూర్తిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మంగపేట: మండలంలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం విరాళాలు అందించిన దాత కొమురవెల్లి లింగమూర్తిని పాఠశాల హెచ్‌ఎం రావుల భాస్కర్‌రావు ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం భాస్కర్‌రావు మాట్లాడారు. దాత లింగమూర్తి చదువుకున్న పాఠశాల అభివృద్ధికి చేయూత ఇవ్వాలన్న సంకల్పంతో రూ.60,000లతో పాఠశాలకు ఫర్నీచర్, విద్యార్థులకు ప్రత్యేకమైన స్కూల్ యూనిఫామ్‌లను అందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పాయం వీరనారాయణ, బాలాజీ, లక్ష్మీనారాయణ, గడ్డం శ్రీనివాస్, జమున, పావని, రాజ్యలక్ష్మి, పద్మ, లావణ్య, సుజాత, స్రవంతి, మహాదేవి, గ్రామస్తులు అశోక్ రెడ్డి, ఉండవల్లి రమేష్, వెంకన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హరికోట్ల రవిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించాలి



మాట్లాడుతున్న నాయకులు

భూపాలపల్లిరూరల్: వరంగల్ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవిని కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించాలని ఉత్తర తెలంగాణ మాల జేఏసీ కన్వీనర్ పీక కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రవికిరణ్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల కోసం వరంగల్ పార్లమెంటు పరిధిలో సేవా కార్యక్రమాలతో పాటు పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడంలో ముందువరపలో ఉంటాడన్నారు. అలాంటి వ్యక్తిత్వం కలిగిన రవిని అభ్యర్థిగా ప్రకటిస్తే ఈ ప్రాంతంలో ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలు అందరం కలిసి భారీ మెజారిటీ తోటి గెలిపించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల జేఏసీ నాయకులు వావిళ్ల రమేష్, బోడ బాపు, శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

మల్హర్: మండలంలోని కొయ్యూరు సెంటర్‌లో భారతరత్న, భారతదేశ రెండోవ ప్రధాని లాల్‌బహదూర్ వర్ధంతిని జాతీయ బీసీ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ.. దేశ ప్రజలు, రైతుల గురించి ఎన్నో ఉద్యమాలు చేశారాని తెలిపారు. శాస్త్రి ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ విజయగిరి సమ్మయ్య, నాయకులు తిరుపతి, అడ్డూరి తిరుపతి, ఎస్టీ, ఎస్సీ సంఘం సీనియర్ నాయకులు నారాయణ, ముత్తన్న లచ్చన్న, సమ్మరాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు పరిశీలన



ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రేగొండ: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ సురేందర్‌గౌడ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం, ఐకెపీ కార్యాలయం, మీసేవ కేంద్రాల్లో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆపరేటర్లకు సూచించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి రాంప్రసాద్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చల్వాయి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నిజాముద్దీన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12నుంచి ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 7న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతిలో ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రైవేట్ పాఠశాలపై దాడి!

మహదేవపూర్: మండల కేంద్రంలో ఓ పాఠశాలపై 10వ తరగతి విద్యార్థి తల్లిదండ్రుల దాడి చేసినట్లు తెలిసింది. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఒక విద్యార్థి గత 20 రోజుల క్రితం కబడ్డీ అడుతు కాలుకు దెబ్బ తగిలించుకున్నాడు. అతడిని పాఠశాల టీచర్లు సామాజిక ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించారు. కాలు గాయం ఇంతవరకూ తగ్గక పోవడంతో కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువేళ్లి పరీక్ష చేయించారు. ఆ గాయం సెప్టిక్ కావడంతో కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు పాఠశాల యాజమన్యాన్ని టీచర్లను తిట్టినట్లు తెలిసింది. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇరువురు ఫిర్యాదు చేసుకున్నారు.

మంచి మార్గాన్ని ఎంచుకోవాలి

ఏటూరునాగారం: విద్యార్థులు మంచి మార్గాన్ని ఎంచుకొని ముందుకువెళ్లాలని ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాలు, వివిధ రకాల అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలను దేవాలయంగా భావించి అన్ని రకాల విద్యాబుద్ధులను నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సాంబశివరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

రేగొండ: మండలంలోని భాగిర్తిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా మోరె సిద్దు, ప్రధానోపాధ్యాయురాలిగా దార్ల పూజిత, పీఈటీగా పోరిక రాహుల్, మిగత పదవ తరగతి విద్యార్థులందరూ ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయురాలు అనిత రెడ్డి, ఉపాధ్యాయులు రాజయ్య, శ్రీనివాస్, ఇంద్రసేనా రెడ్డి, రాజు, భాగ్యలక్ష్మీ, అనురాద, మురళి, పీఈటీ సూదం సాంబమూర్తి, రఘు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలు



వాణి విద్యానికేతన్ పాఠశాలలో ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు



తిరుమలగిరి పాఠశాలలో..

రేగొండ: మండల కేంద్రంలోని వాణి విద్యానికేతన్ పాఠశాలతో పాటు, మండలంలోని రామన్నగూడెం తండా, తిరుమలగిరి గ్రామాల్లోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలురకు పతంగులు, బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రావీణ్యం కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సతీష్‌రెడ్డి, మోహన్‌సింగ్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రవీందర్ రెడ్డి, గీతారెడ్డి, సరిత, అంగన్‌వాడీ టీచర్ సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

మహాముత్తారం: శాస్త్రీయ వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించే చెకుముకి సైన్స్‌టాలెంట్ పోస్టర్‌ను మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంపీడీఓ పెద్ది అంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించడానికి, పరిశీలన శక్తిని సైన్స్ అధ్యయనాన్ని ప్రోత్సహించడానికి ఇలాంటి టాలెంట్ టెస్టులు దోహదపడుతాయని అన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠశాల స్థాయిలో ఈనెల 19న, మండల స్థాయిలో 27న, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 3న నిర్వహించే పరీక్షల్లో జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు పాల్గొనే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎండీ మౌలానా, సీనియర్ ఉపాధ్యాయుడు అనిల్, మండల జన విజ్ఞాన కన్వీనర్ హెచ్ దేవుసింగ్, పీఈటీ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్‌లో ధ్యానం, యోగా



క్యూఆర్‌కోడ్ పత్రాన్ని అందిస్తున్న మాధవి

భూపాలపల్లి రూరల్: స్వామి వివేకనంద జయంతిని (యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని) జిల్లా కేంద్రంలోని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా యువతకు ఉచితంగా ధ్యానం, యోగ చేసుకునే అవకాశం కల్పించినట్లు సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ రవీందర్, సెంటర్ కోర్డినేటర్ మాధవి తెలిపారు. గురువారం వారు జిల్లా కేంద్రంలోని జూనియర్, డిగ్రీ కళాశాల్లో ధ్యానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆసక్తిగల యువకులు క్యూఆర్ కోడ్ ద్వారా పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 94921 10030, 85010 44324 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

రేగొండ: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నేడు (శుక్రవారం) ఉమ్మడి రేగొండ మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ సురేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట, రేగొండ మండలంలోని నాగుర్లపల్లి గ్రామాల్లోని నూతన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం గూడెపల్లి గ్రామంలో కల్చరల్ హాల్ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.